ప్రజాశక్తి
ఆదివారం 7 జనవరి 2024
5
అల్లూరి సీతారామరాజు



శారద ట్రస్ట్ కేలండర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో అంబేద్కర్ పార్క్ ప్రాంగణంలో శారద ట్రస్ట్, శారద నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కేలండర్లను మండల ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి సురేష్, మోహనరావులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో బాల్య వివాహాలు అరికట్టేందుకు, మెరుగైన వైద్యం, విద్య అందించేందుకు, ప్రావిటీ పథకాలు అందించేందుకు సేవ చేసేందుకు శారద ట్రస్ట్ కృషి చేస్తుందన్నారు. గిరిజన ప్రాంతంలో శారద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు ఏర్పాటు చేసి పేద నిరుపేద విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శారద నికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఉపాధ్యాయులు దొన్ను, సిహెచ్. మత్స్యరాజు పాల్గొన్నారు.



కేలండర్ ఆవిష్కరిస్తున్న పాత్రికేయులు, టీచర్లు

అంగన్వాడీలపై జగన్ సర్కారు ఉక్కుపాదం

- ఆనాటి హామీలు మరచి ఎస్మా ప్రయోగం - జిఒ 2ను జారీ చేస్తూ బెదిరింపులు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: సమస్యల పరిష్కారం కోసం గత 26 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై జగన్ సర్కార్ ఉక్కు పాదం మోపింది. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత 26 రోజులుగా ఆందోళన చేస్తున్న అంగన్వాడీలపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అంగన్వాడీల సేవలు అత్యవసర సర్వీసుల కిందకు రానప్పటికీ.. వారిని అత్యవసర సర్వీసుల కిందకు ప్రభుత్వం తీసుకువచ్చింది. తమపై ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడంపై అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ బెదిరింపులకు భయపడేది లేదని తేల్చి చెబుతున్నారు. డిమాండ్ల పరిష్కారానికి 26 రోజులుగా ఆందోళన చేస్తున్న అంగన్వాడీలపై ఏపి ప్రభుత్వం శనివారం ఎస్మా చట్టాన్ని ప్రయోగించింది. వీరిని అత్యవసర సర్వీసుల కిందకి తీసుకొస్తూ జిఒ నెం-2ను జారీ చేసింది. ఆరు నెలల పాటు సమ్మెలు, నిరసనలు నిషేధిస్తున్నట్లు స్పష్టం చేసింది. మరోవైపు సమ్మె చేసిన కాలానికి అంగన్వాడి వర్కర్లు, హెల్పర్ల వేతనంలో కోత విధించింది. సుమారు రూ.3,450 తగ్గించి..రూ.8,050 వేతనాన్ని వారి ఖాతాల్లో జమ చేసింది. అంగన్వాడీలు 26 రోజులుగా సమ్మె చేస్తుంటే చర్చలతో కాలయాపన చేస్తూ డిమాండ్లు నెరవేర్చకపోగా వారిపై ఎస్మా ప్రయోగించడం దారుణం. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చిన సిఎం జగన్ ఇప్పుడు అణిచివేతకు పాల్పడడం అన్యాయం. ఇలాంటి చర్యలకు బెదిరేది లేదని జగన్ ను ఇంటికి పంపే దాకా పోరాటం సాగిస్తామని అంగన్వాడీలు స్పష్టం చేస్తున్నారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యేదాకా పోరాటం ఆపేది లేదని తేల్చి చెబుతున్నారు. 26 రోజులుగా ఆందోళన చేస్తుంటే పట్టించుకోకుండా ప్రభుత్వం బెదిరింపులకు దిగడంపై అంగన్వాడీలు, ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుపడుతున్నారు.



పాడేరు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు (ఫైల్ ఫోటో)

ఎస్మా చట్టాన్ని అతిక్రమిస్తే..

ఎస్మా నిబంధనలను అతిక్రమించినట్లు బలమైన అనుమానం ఉంటే.. అత్యవసర సేవలు అందించే ఉద్యోగులు తమ విధులకు హాజరు కాకుండా ఆయా సేవలకు విఘాతం కలిగేలా సమ్మెలోకి దిగితే నేరశిక్షాస్మృతితో సంబంధం లేకుండా.. పోలీసు అధికారులు వారెంట్ లేకుండానే అరెస్టు చేయొచ్చు. ఎస్మా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఉద్యోగులను డిస్మిస్ చేయడంతో సహా వివిధ రకాల క్రమశిక్షణ చర్యలు చేపట్టవచ్చు. సమ్మె చేస్తున్న వారితో పాటు వారిని ప్రోత్సహిస్తున్న ఈ చట్టం ప్రకారం సమ్మెకు ఆర్థిక సహకారం అందించే వారికి కూడా శిక్ష విధించవచ్చు.

జిఒ 2 జారీ అప్రజాస్వామికం: సిపిఎం

ప్రజాశక్తి -పాడేరు: అంగన్వాడీల సమ్మెపై ఎస్మాను ప్రయోగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 2 జారీ చేయడాన్ని సిపిఎం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అప్పలనరస తీవ్రంగా ఖండించారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, తక్షణమే జీవోను ఉపసంహరించి, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 26 రోజులుగా శాంతియుతంగా జరుగుతున్న అంగన్‌వాడీలను ఎస్మా చట్ట పరిధిలోకి తీసుకువచ్చి సమ్మెను నిషేధించడం అప్రజాస్వామికమన్నారు. సమస్యలు పరిష్కరిం చకుండా సమ్మె నిషేదిచడం దుర్మార్గమన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మోడీ అడుగుజాడల్లో ఉద్యమాన్ని అణిచి వేయాలని చూస్తోందని విమర్శించారు. ఇదే వైఖరి కొనసాగితే జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ చర్యను కార్మిక, ప్రజా సంఘాలు, పార్టీలు ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు.

అనంతగిరి: అంగన్వాడీలపై ఎస్మాను ప్రయోగిస్తు తీసుకొచ్చిన జిఓ 2 చట్ట విరుద్ధమని జెడ్పిటిసి దీసరి గంగరాజు, సిఐటియు మండల కార్యదర్శి కె. తెలిపారు. స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా బెదిరింపులకు రాష్ట్ర ప్రభుత్వం పాల్పడుందని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి కనీస వేతనం రూ 26 వేలు పెంచాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ముంచింగిపుట్టు: అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించి, జీవో 2ని తీసుకు రావడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొర్ర త్రినాథ్, మండల కార్యదర్శి పాంగి భీమరాజు విమర్శించారు. మండల కేంద్రంలో శనివారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో త్రినాథ్ మాట్లాడుతూ, అంగన్వాడీలకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ, అంగన్‌వాడల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అంగన్వాడీలపై ఎస్మా చట్టవిరుద్ధం

అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగిస్తూ విడుదల చేసిన జిఒ-2 చట్ట విరుద్ధం. జిఒలతో అంగన్వాడీల అన్యాయ పోరాటాన్ని అడ్డుకోలేరు. అంగన్వాడీలు 26 రోజులుగా సమ్మె చేస్తుంటే సమస్యలను పరిష్కరించడంలో జగన్ ప్రభుత్వం విఫలమైంది. అంగన్వాడీలు అత్యవసర సర్వీసు అని భావించినప్పుడు 26 రోజులుగా సమ్మె చేస్తుంటే చర్చలతో కాలయాపన చేస్తూ సమస్యలను పరిష్కరించకపోవడం రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత. అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగిం చడం సిగ్గుచేటు. తక్షణము ఎస్మాను రద్దు చేయాలి.



వి.ఉమామహేశ్వరరావు
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

జిఒ 2ను రద్దు చేయాలి

ప్రభుత్వం అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తూ జారీ చేసిన జిఒ-2ను తక్షణమే రద్దు చేయాలి. అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. అంగన్వాడీలపై ఇలాంటి కక్షపూరితమైన జిఒను విడుదల చేయడం దుర్మార్గమైన చర్య. ప్రభుత్వ నియంతత్వ ధోరణికి ఇది నిదర్శనం. ఈ వైసీపీ ప్రభుత్వం పై అంతిమ విజయం అంగన్వాడీలదే. ప్రజాతంత్ర వాదులంతా ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండించాలి.అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగిం చడం సరికాదు. తక్షణమే స్పందించి రద్దు చేయాలి.



ఎస్.హైమావతి
గిరిజన మహిళా సంఘం జిల్లా కార్యదర్శి



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్

హాస్టల్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

గిరిజన సంక్షేమ హాస్టల్ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో శనివారం గిరిజన సంక్షేమ హాస్టల్ వర్కర్లు సమావేశం కారం శ్రీను అధ్యక్షతన జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్ పాల్గొని మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తమ సమస్యలపై పోరాటాలు చేస్తున్న కార్మికులను నిర్బంధిస్తూ వారి గొంతును నొక్కుతుందని పేర్కొన్నారు. సమానపనికి సమానవేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సీనియారిటీ ప్రకారం పర్మినెంట్ చేయాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వర్కర్ల సంఖ్యను పెంచాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి కార్మికులు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.శాంతిరాజు, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు, హాస్టల్ వర్కర్ల యూనియన్ నాయకులు రత్నం, టి.వరలక్ష్మి, జి.వెంకటేశ్వర్లు, జి.బాలమ్మ, ఎన్,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సీలేరులలో దట్టంగా కురుస్తున్న మంచు

పెరిగిన చలి తీవ్రత

- దట్టంగా కురుస్తున్న మంచు

ప్రజాశక్తి -సీలేరు

ఏజెన్సీ ప్రాంతంలో రెండు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. జికె.వీధి మండలం సీలేరు, దారకొండ పరిసర ప్రాంతాల్లో మంచు దట్టంగా కురుస్తుండడంతో ఉదయం 9 గంటలైనా భానుడి దర్శనం కానరావడం లేదు. సాయంత్రం ఐదు గంటల నుండే చల్లటి గాలులు వీస్తూ చలి తీవ్రత అధికంగా ఉంటుంది. దీంతో ఏజెన్సీ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం చలి మంచు కారణంగా 9 గంటల వరకు వ్యాపారులు దుకాణాలు తెరవడానికి సాహసించడం లేదు. సంక్రాంతి సమీపిస్తుండడంతో చలి తీవ్రత మరింత అధికమవుతుందని వృద్ధులు ఆందోళన చెందుతున్నారు. మంచు తీవ్రత అధికంగా ఉండడంతో ఉదయం పూట సీలేరు నుంచి దారకొండ, గూడెం, చింతపల్లి మీదగా మైదాన ప్రాంతానికి వెళ్లే వాహనదారులకు రహదారి కనిపించక హెడ్‌లైట్లు వేసుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. సీలేరు నది పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులు చలి తీవ్రతకు తట్టుకోలేక చలిమంటలు వేసుకొని ఉపశమనం పొందుతున్నారు. ఈ ప్రాంతానికి వచ్చిన సందర్శకులు సైతం చలి తీవ్రంగా ఉండడంతో పలు ఇబ్బందులు గురవుతున్నారు. మంచు అధికంగా ఉండడంతో సీలేరులో మంచు తెరలు ఉదయం తొమ్మిది గంటల వరకు వీడడం లేదు. ఉదయం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు చలి తీవ్రతకు అనే ఇబ్బందులు గురవుతున్నారు.

ఎస్ఎస్ఎ ఉద్యోగుల అరెస్టు తగదు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేపడుతున్నా ప్రభుత్వం స్పందించక పోవడంతో చలో విజయవాడ కార్యక్రమం చేపట్టిన ఎస్ఎస్ఎ ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేయడం తగదని యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజారావు, ఎస్.బాలకృష్ణ తీవ్రంగా ఖండించారు. శనివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, విధులు బహిష్కరించి ఆందోళన చేపడుతున్న ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం సరికాదన్నారు. దీనికి తోడుతున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులను విధుల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలకు నిరసనగా చలో విజయవాడ చేపట్టి ఎస్ఎస్ ఏ డైరెక్టర్ కార్యాలయం ముట్టడి చేసిన ఎస్ఎస్ ఏ ఉద్యోగులను అరెస్టు చేయడం సరికాదని, తక్షణమే వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎంపి మాధవికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నాయకులు

వైసిపి నేతల నిరసన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో నుండి ఎంపీ మాధవి అరకు వైపు వెళ్తున్న సమయంలో వైసీపీ నాయకులు, జెడ్పిటిసి సర్పంచులు, ఎంపీటీసీలు రోడ్డుపై ఎంపి కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. నాన్ లోకల్ వద్దు లోకల్ ముద్దు ఎంపీ గో బ్యాక్ అంటూ శనివారం ఆందోళన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ, అరకు నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థులుగా ఎంతోమంది ఆశావహులు ఉండగా పాడేరు నియోజకవర్గం నుంచి ఎంపీని ఎమ్మెల్యేగా అధిష్టానం ప్రకటించడం తీవ్ర అన్యాయమన్నారు. అధిష్టానం పునరాలోచన చేయాలని వారు కోరారు. లేనిపక్షంలో అరకు నియోజకవర్గంలో వైసిపికి ఓటమి ఖాయమన్నారు.అరకు నియోజకవర్గంలో ఉన్న నాయకులను అధిష్టానం గుర్తించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రేగం మత్స్యలింగం, సర్పంచులు రమేష్, సుబ్బారావు, ఎంపీటీసీలు సాంబ, నాయకులు సత్తిబాబు, కోటిబాబు, భూషణ్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్‌కు పేర్లు నమోదు

ప్రజాశక్తి- పెదబయలు: మండల కేంద్రంలో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో గ్రూప్-2 అభ్యర్థులకు ఉచిత మెటీరియల్స్ పంపిణీ చేస్తామని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్, జిల్లా ఉపాధ్యక్షులు కొర్ర నరసయ్య, ఎంఎం శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రూప్ 2కు అప్లై చేసిన అభ్యర్థులు ఆదివాసి గిరిజన సంఘం కార్యాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం పెద్దబయలు మండల అధ్యక్ష కార్యదర్శులు బొండా గంగాధరం, కిలో సర్బన్న, చిట్టిబాబు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న మధ్యాహ్న కార్మికులు, నాయకులు

'మధ్యాహ్న' కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

ప్రజాశక్తి-హుకుంపేట: మిడ్ డే మీల్స్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ నేత, వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, కిల్లో రామారావు, మిడ్ డే మీల్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు వంతాల స్వప్నలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గిరిజన సంఘం భవన్‌లో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ,స్కూల్ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం ఖర్చు భరించి పెడుతున్నారన్నారు.ప్రతీ నెల 5వ తేదీ లోపు వేతనాలు, బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.పెరుగుతున్న ధరలకు అనుగూనంగా మెనూ చార్జీలు పెంచాలని, ప్రమాద భీమా, నష్ట పరిహారం చెల్లించాలన్నారు. సీఎం జగన్ పాద యాత్రలో ఇచ్చిన హామీ అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ ఎం, శానిటరీ వర్కర్స్ కొర్ర సోమరన్న, సీసా కోటేశ్వరరావు, కృష్ణవేణి, కాంతమ్మ, రత్నాలమ్మ, ముక్తమ్మ, చిలకమ్మ, వరలక్ష్మి, బంగారమ్మ పాల్గొన్నారు.

పాఠశాలకు భవనం నిర్మించాలని రాస్తారోకో

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని కొండాయిగూడెం గ్రామంలో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని, తక్షణమే కొత్త భవనం నిర్మించాలని కోరుతూ పాఠశాల ఎదురుగా రోడ్డుపై విద్యార్థులు, గ్రామస్తులు శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పాఠశాల భవనం పూర్తిగా శిథిలమైందని, వర్షం వస్తే కారిపోయి మొత్తం తడిసిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్లాబ్ పెచ్చులు ఎప్పుడు ఊడి పిల్లలపై పడతాయో తెలియని పరిస్థితి ఉందని, దీంతో పిల్లలను పాఠశాలకు పంపడానికి భయపడుతున్నామని పేర్కొన్నారు. కొత్త భవనం నిర్మించాలని 2018 నుండి ఇప్పటి వరకు అనేక సార్లు అధికారులకు, ఐటిడిఎ పిఒకు వినతిపత్రాలు ఇచ్చామని, అయినా నేటికీ కొత్త భవనం మంజూరు చేయాలేదన్నారు. తక్షణమే నిధులు మంజూరు చేసి కొత్త భవనం నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు.



రాస్తారోకో చేస్తున్న కొండాయిగూడెం ప్రజలు, విద్యార్థులు

సమస్య పరిష్కారానికి కృషి : సిఐ

రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న సమయంలో అటుగా వస్తున్న ఎటపాక సిఐ పి.రామారావు అక్కడకు వచ్చి సమస్యను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు సమస్య చెప్పడంతో పాఠశాలను సందర్శించి ఎంఈఓ లక్ష్మీనారాయణతో మాట్లాడారు. పాఠశాల పరిస్థితి బాగా లేదని సమస్య పరిష్కరించాలని సూచించారు. పైఅధికారులతో తాను కూడా మాట్లాడి సమస్య పరిషారమయ్యే విధంగా కృషి చేస్తానని సిఐ హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, ఎంపీటీసీ జయసుధ, ఆవుల ఉపేంద్ర, కర్నాటి శ్రీనివాసరావు, ముత్తయ్య రమ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రచారం కోసం పింఛన్ల నిలుపుదల సరికాదు

ప్రజాశక్తి-విఆర్.పురం

1వ తేదీన ఇవ్వాల్సిన పింఛన్లను తమ రాజకీయ ప్రచారం కోసం నిలుపుదల చేయడం సరికాదని సిపిఎం మండల కార్యదర్శి సోమం చిన్నబాబు, ఎంపిపి కారం లక్ష్మి అన్నారు. మండల కేంద్రం రేఖపల్లిలోని సిపిఎం కార్యాలయంలో శనివారం వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్సీ అనంతబాబు ఆదేశాలతో మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల ద్వారా పింఛను లబ్ధిదారులను మండల కేంద్రానికి తరలించాలని ఒత్తిడి చేయడం, బెదిరించడం అనైతిక చర్య అని పేర్కొన్నారు. పింఛన్లు, సంక్షేమ పథకాలు వైసిపి ప్రభుత్వమే కొత్తగా తీసుకొచ్చినట్లు పండగ లాగా ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికల హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2000 పింఛన్‌ను రూ.3000కు పెంచాల్సి ఉండగా, నాలుగున్నరేళ్లకు రూ.3000కు పెంచి పింఛన్ లబ్ధిదారులను మోసం చేశారని ఎద్దేవా చేశారు. ఏజెన్సీలో అభివృద్ధి నిలిపివేశారని, గ్రామాలు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు పంకు సత్తి బాబు, గుండిపూడి లక్ష్మణరావు, సోడి మల్లయ్య, చీరపు తాత బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు

అనారోగ్యంతో సిపిఎం నాయకులు కారం బుజ్జి మృతి

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలో శ్రీరామగిరి పంచాయతీ పరిధి చోక్కనపల్లి గ్రామ సిపిఎం సీనియర్ నాయకులు కారం బుజ్జి అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. బుజ్జికి భార్య ముత్తమ్మ, ఇద్దరు కుమార్తెలు పోచమ్మ, రాణి ఉన్నారు. ఈ మేరకు సిపిఎం మండల నాయకులు శనివారం బుజ్జి మృతదేహంపై పార్టీ జెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. బుజ్జి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ కారం బుజ్జి పార్టీకి ఎంతో సేవ చేశాడని, ఆయన ఆశయాలను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరామగిరి మాజీ సర్పంచ్ పులి ధర్మరాజు, సిపిఎం నాయకులు గొంది ధారయ్య, తోవడం రాజులు, పంకు సత్తిబాబు, శాఖా కార్యదర్శి గుండుపూడి లక్ష్మణరావు, కమ్మ చిచ్చు సత్యనారాయణ, సోడి మల్లయ్య, తోడం సీతారాములు, గాలిదేవుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మృతదేహంపై ఎర్రజెండా కప్పి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

కాంగ్రెస్ మండల అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి-చింతూరు

రంపచోడవరం నియోజకవర్గంలోని 9 మండలాలకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను ఆ పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు చింతూరు డివిజన్ కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆ వివరాలను పిసిసి ప్రతినిధి ఎమ్‌డి హాబీబ్ వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్షులు వంతల సుబ్బారావు సూచన మేరకు పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు వీరిని నియమించినట్లు చెప్పారు. ఎటపాక మండల అధ్యక్షులుగా నక్క వెంకన్న, కూనవరం మండల అధ్యక్షులుగా శ్రీమంతుల వెంకటరమణ, విఆర్.పురం మండల అధ్యక్షులుగా ఎ.లీలానాగేంద్ర కృష్ణప్రసాద్, చింతూరు మండల అధ్యక్షులుగా ఎమ్‌డి.హబీబ్, మారేడుమల్లి అధ్యక్షులుగా పుడికొడ హరికృష్ణ, రంపచోడవరం మండల అధ్యక్షులుగా నక్క బాలశివ రామకృష్ణ, అడ్డతీగల మండల అధ్యక్షులుగా దంగేటి సత్తిబాబు, రాజవొమ్మంగి మండల అధ్యక్షులుగా షేక్ మహబూబ్ అలీ, గంగవరం మండల అధ్యక్షులుగా నారవ దుర్గాప్రసాద్ నియమించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో చింతూరు మండల కాంగ్రెస్ నాయకులు షేక్ ఆహ్మదాలి, రవి, ఎండి జవహెూర్, నరేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

రాజవొమ్మంగి : మండలంలోని కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ రాజవొమ్మంగి మండల అధ్యక్షులుగా కొత్తగా నియమించబడిన ఎస్‌కెఎం మహమ్మద్ అలీ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తనను కాంగ్రెస్ మండల అధ్యక్షులుగా నియమించడం పట్ల పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, అల్లూరి జిల్లా అధ్యక్షులు వంతల సుబ్బారావు, రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ రాజేష్, పిసిసి డెలిగేట్ ఎమ్‌డి హాబీబ్ తదితరులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సైనికుడిలా పని చేస్తానని తెలిపారు.



నియామక పత్రం చూపుతున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎమ్‌డి హబీబ్

ఎస్మాపై అంగన్‌వాడీల భగ్గు

- జిఒ 2ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న చిన్నయ్య పడాల్

ప్రజాశక్తి -యంత్రాంగం

చింతపల్లి:సమ్మెపై ఎస్మా ప్రయోగించడంతోనే ప్రభుత్వ పతనం ప్రారంభమైందని సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ విమర్శించారు. చింతపల్లిలో అంగన్వాడి సమ్మె శిబిరంలో చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయడం చేతకాక భయపెట్టడానికి పూనుకోవడం సరి కాదన్నారు. పాలు, నీరు, విద్యుత్తు వంటివి అత్యవసర సర్వీసుల కిందకు వస్తాయని, ఇది కూడా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. జీవో 2ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు. రాములమ్మ, పెంటమ్మ, సత్యవతి, నాగమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

పాడేరు: తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టిన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు శనివారం ఐటిడిఏ ఎదుట నిరవధిక దీక్షలు ప్రారంభించారు. అంగన్వాడీల సమ్మె 26వ రోజు శనివారం కొనసాగింది. ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ నిరవధిక దీక్షలు చేపట్టినట్లు అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి కే భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు చిన్నారి, ఛాయాదేవి, అంబికా, జయ, సత్యవతి, కుమారి కార్మికులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

దుంబ్రిగుడ: -సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ కార్మికులు చేపడుతున్న సమ్మె శనివారం 27వ రోజుకు చేరుకుంది. మండల కేంద్రంలోని హైవే రోడ్డు యూనియన్ బ్యాంక్ జంక్షన్ వద్ద అంగన్వాడీ కార్మికులు డ్యాన్స్ చేస్తూ వినుత్న రీతిలో తమ నిరసనను ప్రభుత్వానికి తెలియజేశారు . అంగన్వాడి కార్మికులు చేసిన డ్యాన్సును రోడ్డు గుండా రాకపోకలు సాగించిన వాహనదారులు స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు కే కొండమ్మ ,జి పవిత్ర, సత్యవతి ,అంగన్వాడి కార్మికులు, హెల్పర్లు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు:మండల కేంద్రంలో అంగన్‌వాడీల సమ్మె 26వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్వాడి మండల అధ్యక్షురాలు ఈశ్వరమ్మ మాట్లాడుతూ, ఎస్మా ప్రయోగించి జీవో 2 జారీ చేసి వేధింపులకు గురి చేయడం సరికాదన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అంగన్వాడీలకు తెలంగాణ రాష్ట్రం కంటే అదనంగా వెయ్యి రూపాయలు పెంచుతామన్న మాట నిల బెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు కొర్ర త్రినాథ్, మండల ఉపాధ్యక్షుడు భీమరాజు, అంగన్వాడీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో...

హుకుంపేట:స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపడుతున్న దీక్ష శనివారం 26వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి గౌరవాధ్యక్షులు గండేరు చిన్న సత్యం మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీలు పోరాటం చేస్తున్నారని, పున:ఆలోచన చేయాలన్నారు. నెలరోజులుగా చేపడుతున్న దీక్షలపై ప్రభుత్వం స్పందించకపోవడం బాధా కరమన్నారు. ప్రభుత్వం స్పందించి రూ. 26,000 వేతనం ప్రకటించాలని కోరారు.

పెదబయలు:మండల కేంద్రంలో అంగన్వాడీల సమ్మె 26వ రోజుకు చేరింది. సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సమ్మె, ఆందోళనలు తెలపడానికి సంపూర్ణ హక్కు ఉందన్నారు. సమ్మె నుండి తప్పించేందుకు ఎస్మా చట్టం అమలు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుండా బెదిరింపులకు పాల్పడుతుందని విమర్శించారు. అంగన్వాడీలకు ఆదివాసీ గిరిజన సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీల వద్దకు వెళ్లిన చంద్రబాబు నాయుడు రాజకీయం కోసం అధికారంలోకి వస్తే న్యాయం చేస్తాననడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షులు ధర్మన్న పడాల్, పూర్వ అధ్యక్షుడు బోండా సన్నిబాబు, ఎంఎం శ్రీను, శరబన్న, గంగాధర, కొసెల్లు, కొండమ్మ, రాజమ్మ, పద్మ, సుశీల పాల్గొన్నారు.



పెదబయలులో అంగన్‌వాడీలకు మద్దతుగా కూర్చున్న కిల్లో సురేంద్ర



రాజవొమ్మంగిలో అమ్మోరు అవతారంలో... నిరసన

రాజవొమ్మంగి : అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ శనివారం అంగన్‌వాడీలు అమ్మోరు అవతారం ఎత్తారు. అమ్మోరు వేషధారణతో నృత్యం చేసి నిరసన తెలిపారు. సమ్మె ప్రారంభించి 26 రోజులైన సందర్భంగా స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం ఎదురుగా దీక్షా శిబిరం వద్ద అంగన్‌వాడీలు 26 సంఖ్య సర్కిల్‌గా కూర్చొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. వీరి దీక్షా శిబిరాన్ని హిజ్రాలు సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ నాయకురాలు వెంకటలక్ష్మి, చిన్నికుమారి మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్ సత్యవతి, సూరకాంతం, కె.లక్ష్మి, చిన్నమ్మలు, రమణి, రమణ, రత్నం, రాజేశ్వరి, మంగ, రాధ పాల్గొన్నారు.

అడ్డతీగల : స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో గత 26 రోజులుగా ఆందోళన చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు, శనివారం నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ శిబిరానికి ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు సందర్శించి సంఘీభావం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జేబీ రాణి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

రంపచోడవరం : 26వ రోజులుగా ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు శనివారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఇందులో పాల్గొన్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, కార్యదర్శి నిర్మల మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శాంతిరాజు, కె.రామలక్ష్మి, కె.సింగరమ్మ, వి.సత్యవేణి పాల్గొన్నారు.

చింతూరు : అంగన్వాడీల 26వ రోజు దీక్షలను యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరమణ, నూక రత్నం శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కామేశ్వరి, జయ, ముత్యమ్మ, సత్యవతి, విజయకుమారి, కనకదుర్గ, భద్రమ్మ, దుర్గ, చిట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

వి.ఆర్.పురం : మండలంలోని రేఖపల్లి వద్ద అంగన్వాడీ చేస్తున్న 26వ రోజు ఆందోళనను యూనియన్ నాయకులు సున్నం రంగమ్మ ప్రారంభించారు. మండలంలోని ములకపల్లి పంచాయతీలో మిడ్డి మిల్స్ టీచర్ కారం ముత్యమ్మ మృతి చెందడంతో అంగన్వాడీల దీక్ష శిబిరంలో రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళు లర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజేశ్వరి, కనక మహాలక్ష్మి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండల కేంద్రంలో అంగన్వాడీల ఆందోళన 26వ రోజు చేరుకుంది. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.సత్యనారాయణ, అంగన్వాడీలు పాల్గొన్నారు.



అడ్డతీగలలో...



రంపచోడవరంలో...



చింతూరులో దీక్షలో కూర్చున్న అంగన్‌వాడీలు

అక్రమ భవనంలో ప్రభుత్వ బ్యాంక్ సరికాదు

- ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:మండల కేంద్రంలో ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు (ఏపీజీవీబీ) గిరిజనేతరుడైన రంగా వెంకట సత్యనారాయణ మూర్తి అక్రమ భవనంలో నడపడం సరికాదని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ కు ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్, అరకువేలి మండల అధ్యక్షులు జి.బుజ్జిబాబు. ఆదివాసి నిరుద్యోగుల సంఘం కన్వీనర్ కుమిడి రమేష్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ద్వారా అరకువేలి, డుంబ్రిగూడ, అనంతగిరి మండలాల పరిధిలోని లబ్ధిదారులు సేవలు పొందుతున్నారన్నారు.గిరిజనేతరులు చట్ట విరుద్ధంగా భవనాలు లీజులకు, అద్దెలకు ఇవ్వడం సరికాదన్నారు.ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న ఏపీజీవీబీ బ్యాంకును ఆదివాసి హక్కులు, చట్టాలు ఉల్లంఘించి ప్రభుత్వమే గిరిజనేతరుడి అక్రమ భవనంలో నడపడం అన్యాయమన్నారు.మండల కేంద్రంలో గతంలో మాక్స్ బ్యాంక్ సొసైటీ నడిపిన ప్రభుత్వ భవనం, ప్రాథమిక జ్యుడీషియల్ కోర్టు నడిచిన ప్రభుత్వ భవనం, ఐటీడీఏ షాపింగ్ కాంప్లెక్స్ ఖాళీగా ఉన్నాయని తెలిపారు. గిరిజనేతరుడి అక్రమ బహుళ అంతస్తు భవనంలో ప్రభుత్వ బ్యాంకు నడపడం దుర్మార్గమన్నారు. తక్షణమే జోక్యం చేసుకుని బ్యాంక్‌ను ఖాళీ చేసి అక్రమ భవనం నిర్మించిన రంగా వెంకట సత్యనారాయణ మూర్తి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన ఐటీడీఏ పీవో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



మోటివేషనల్ తరగతిలో మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

విద్యార్థులు కష్టపడి చదవాలి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:స్థానిక శారదా నికేతన్ పాఠశాలలో డి.శారదా ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 300 విద్యార్థులకు మోటివేషనల్ తరగతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శారదనికేతన్ పాఠశాల ప్రదానో పాధ్యాయులు ఎస్.చిరంజీవులు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన లైప్ కోచ్ హెచ్ఎర్డి ట్రైనర్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ, 10వ తరగతి విద్యార్థులకు మెలుకువలు, నైతిక విలువలపై బోధించారు. విద్యార్థులు తమ గమ్యాన్ని చేరాలంటే క్రమ శిక్షణతో కష్టపడి చదువుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో జిటిడబ్ల్యుఎ స్కూల్ ప్రదానోపా ధ్యాయులు ఎల్.ధయానిది, ప్రదానోపాధ్యాయులు టి.మోహన్‌రావు, రోజాకిరణ్, శారదా నికేతన్ పాఠశాల కమిటీ సభ్యులు వి. ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గడపలోనే చదువులు

- అసంపూర్తిగా నిలిచిన పాఠశాల భవనం పనులు

ప్రజాశక్తి- అనంతగిరి:పాఠశాల భవనం లేక ఇంటి గడపపై విద్యా బోధన కొనగిస్తున్నారు.నాడు నేడు పథకం నిధులు కూడా మంజూరు కాలేదు. దీంతో ఆరుబయటే విద్యార్థులు విద్యా బోధనను కొనసాగిస్తున్నారు. మండలంలోని వాలసి పంచాయతీ పరిధి ఊటగెడ్డ గ్రామంలో ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో పది మంది విద్యార్థులు పైగా చదువుతున్నారు.పాఠశాల నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం నిధులను మంజూరు చేయగా 2012-13 సంవత్సర కాలంలో అప్పటి ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ పనులను చేపట్టారు. భవనం పూర్తి చేయకుండా మొండి గోడలతో వదిలి వేశారు. దీంతో గత్యంతరం లేక ఇంటి వరండాలో విద్యా బోధన కొనసాగిస్తున్నారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులు ఇతర వస్తువులు భద్రపరిచేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఉపాధ్యాయురాలు పద్మ పేర్కొన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:లబ్ధిదారులకు ఆసరా కల్పించడానికి ప్రభుత్వం పింఛన్లను మూడు వేలకు పెంచిందని ఎమ్మెల్యే పాల్గుణ చెప్పారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శనివారం ప్రభుత్వం పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పింఛన్లే కాకుండా అన్ని రకాలుగా ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఒక్కరికి ఆర్థిక సాయం అందిస్తూ ఆసరా కల్పిస్తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బీఈశ్వరి, జడ్పిటిసి సిహెచ్ జానికమ్మ వైస్ ఎంపీపీ ఎస్ ఆనంద్, ఎంపీడీవో బి ఉషారాణి ,తాసిల్దార్ సిహెచ్ నాగమ్మ, అధికారులు, గ్రామ వాలంటీర్లు వైసిపి నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రభుత్వం నూతనంగా పెంచిన రూ.3వేల పింఛన్లను మండలంలోని అరకు పంచాయతీలో సర్పంచ్ జీ.శారద, ఎంపిటిసి ఎల్.వరహాలమ్మ లబ్ధిదారులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయోవృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఆర్థికంగా ఆసరా కల్పించడానికి ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా పింఛన్లను రూ 3 వేలకు పెంచిందని చెప్పారు. వైసిపి ప్రభుత్వం అన్ని రకాలుగా సామాన్య, మధ్యతరగతి ప్రజలను ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని తామరపల్లి రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా అగ్రికల్చర్ అసిస్టెంట్ భాస్కర్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో పండించిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రంలో అమ్మడం వలన ప్రభుత్వం నుండి మద్దతు ధర లభిస్తుందని చెప్పారు. ఆర్ఒఎఫ్ఆర్ పట్టాదారులకు కూడా పీఎం కిసాన్ వర్తిస్తుందని దానికి సంబంధించిన వివరాలు వాలంటీర్లకు తెలియజేయాలని కోరారు. రబీ పంటల నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముసిరిమిల్లి ఎంపిటిసి కుంజం వంశీ, గృహ సారధి బాపన్న తదితరులు పాల్గొన్నారు.

జిందాల్‌తో ఎంఒయును బహిర్గతం చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ ఉక్కు యాజమాన్యం బిఎఫ్-3 విషయంలో జిందాల్‌తో కుదుర్చుకున్న ఎంఒయును వెంటనే బహిర్గతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు శనివారానికి 1010వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం మెటీరియల్ సప్లై, కన్వర్షన్ ఇఒఐ పేరుతో జిందాల్‌తో రెండు సంవత్సరాల పాటు ఒప్పందం చేసుకోవడం అత్యంత ఆందోళనకరమన్నారు. ఇది ప్రైవేటీకరణకు తొలిమెట్టు అని పేర్కొన్నారు. కాలేదా బాబా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా నాయకులు కాసారపు సత్యనారాయణ, త్రినాథ్, బంగారు దుర్గారావు, డోల ప్రసాదు పాల్గొన్నారు.

8 నుంచి బిఎస్ఎన్ఎల్ ఐపి టివి ఒటిటి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బిఎస్ఎన్ఎల్ ఐపి టివి ఒటిటిని సోమవారం నుంచి ప్రారంభిస్తోందని, వినియోగదారులు ఆ సేవలను వినియోగించుకోవాలని ఎస్‌డిఇ దొగ్గ శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు. ఈ సర్వీస్ స్మార్ట్ టివి ఉన్న వాళ్ళు యాప్ ఇన్‌స్టాల్ చేసుకొని చూడవచ్చునన్నారు. స్మార్ట్ టీవీ లేని వారు ఫైర్ స్టిక్‌తో ఈ సేవలు వినియోగించుకోవచ్చునని తెలిపారు. ఈ సేవలు మొదటి వారం రోజులు ఉచితంగా పొందవచ్చని అన్నారు. డిజిటల్ ఇండియా, ఫైబర్ జె యేషన్‌లో భాగంగా అన్ని కాపర్ బేస్డ్ ల్యాండ్ లైన్లను ఫైబర్‌లోకి మార్చుతున్నట్టు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగులందరికీ పెన్షన్ ఇవ్వాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేసి, దీర్ఘకాలం సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన వారందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని శనివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ విశాఖపట్నం డివిజన్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సు ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. సదస్సుకు అసోసియేషన్ అధ్యక్షులు కె.మోహనరావు అధ్యక్షత వహించారు. ఎఐపిపిఎ అధ్యక్షులు సతఙ్జీబ్ దాస్, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ దేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 13,80 లక్షల మంది వయోవృద్ధులు ఉన్నారన్నారు. వారిలో కొద్ది మందికి మాత్రమే వారి సంస్థ నుంచి పెన్షన్లు అందుతున్నాయని తెలిపారు. మిగిలిన వారందరికీ ఏవిధమైన ఆర్థిక ఆసరా లేనందున వారి ఆర్థిక అవసరాల కోసం వారి వారి పిల్లలపై ఆధారపడుతున్నారని చెప్పారు. ఆర్థిక భారాలు పెరిగిపోయిన ఈ రోజుల్లో వారికి తల్లిదండ్రులు భారంగా మారిపోయారన్నారు. అందుకే నిత్యం కొంతమంది అభాగ్య సీనియర్లు రోడ్లపైకి నెట్టబడుతున్నారన్నారని, ఘోరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సీనియర్లు అందరూ సర్వీసు కాలంలో వారి వారి సంస్థలకు విశేషమైన సేవలందించిన వారేనని, వారి శ్రమ వల్ల ఆయా సంస్థలు అభివృద్ధి చెందాయని అన్నారు. జాతీయ ఉత్పాదకతలో కూడా వారు భాగస్వాములైనందున వృద్ధాప్యంలో వారి బాగోగులు చూడవలసిన బాధ్యత ఆయా సంస్థలది, ప్రభుత్వానిదని అన్నారు. వయోవృద్ధుల జీవనం కోసం నిధులను ప్రభుత్వాలు కేటాయించాలని రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలోని ఆర్టికల్ 41లో పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. పెన్షన్ భిక్ష కాదని, వృద్ధాప్యం కోసం వాయిదా వేసిన జీతవని తెలిపారు. యాజమాన్యాలు పెన్షన్ల కోసం నిధులను కేటాయించాలని 1992లో సుప్రీంకోర్టు సలహా ఇచ్చిందని గుర్తు చేశారు. దాన్ని కేంద్రం, కొన్ని సంస్థలు పెడచెవిన పెట్టాయని తెలిపారు. ప్రభుత్వాలు 2004 నుంచి న్యూ పెన్షన్ స్కీం అమలు చేస్తున్నాయని చెబుతూ దీంతో జరిగే ప్రమాదాన్ని వివరించారు. సదస్సులో డిఫెన్స్ పెన్షనర్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకట్రావు, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు బిటి.మూర్తి, బిఎస్ఎన్ఎల్, డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు అసరఫ్, రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు వి.నరసింగరావు, ఐసిఇయు డివిజన్ అధ్యక్షురాలు ఎం.కామేశ్వరి, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సాగర్, జిఐపిఎ అధ్యక్షులు పివి.సుబ్బారావు, కార్యదర్శి సాల్మన్‌రాజు, పోస్టల్ పెన్షనర్స్ అసోసియేషన్ డివిజనల్ కార్యదర్శి ఎంఆర్‌డి.రాజు, డిఫెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.రామాంజనేయులు మాట్లాడారు.



సదస్సులో మాట్లాడుతున్న అజశర్మ

గ్లోబల్ హెల్త్ కేర్ ఆసుపత్రి ప్రారంభం



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న డాక్టర్ అశోక్ కుమార్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలోని సీతమ్మధార హెచ్‌బి కాలనీ రోడ్డులో ఏర్పాటు చేసిన 'గ్లోబల్ హెల్త్ కేర్' సెంటర్‌ను కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్ శనివారం ఉదయం ప్రాంభించారు. అనంతరం అయన మాట్లాడుతూ విశాఖ మహా నగరంలో ఆసుపత్రులకు కొదువలేదన్నారు. ప్రభుత్వం వాడవాడలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నెలకొల్పి వైద్య సేవలు అందిస్తోందన్నారు. గ్లోబల్ హెల్త్ కేర్ సెంటర్ మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. గ్లోబల్ హెల్త్ కేర్ నిర్వాహకులు రవీంద్రనాథ్, పరశురామ్ మాట్లాడుతూ సీతమ్మధార హెచ్‌బి.కాలనీ పరిసర ప్రాంత వాసులకు అందుబాటు ధరలలో వైద్య సేవలు అందించాలనే దృక్పథంతో దీన్ని నెలకొల్పామన్నారు. అతి తక్కువ ఫీజులు, మెడికల్ టెస్టులు, మెడిసిన్‌పై తగ్గింపు వంటి సౌకర్యాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు అప్పరి విద్యా, మొల్లి లక్ష్మి, అప్పారావు, స్థానిక ప్రముఖులు బాబ్జీ, చిరంజీవి, రవి శంకర్ పాల్గొన్నారు.

పెరుగుతున్న కోవిడ్ కేసులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో కోవిడ్ కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మీడియాకు అందజేసిన సమాచారం ప్రకారం డిసెంబర్ 21 నుంచి ఈ నెల 6 వరకూ కోవిడ్ నిర్ధారణ టెస్టులు 975 నిర్వహించారు. అందులో 62 మందికి పాజిటివ్ వచ్చింది. ప్రస్తుతం కోవిడ్ బాధితులు 34 మంది ఉండగా 32 మంది ఇంటిలోనే ఉండి వైద్య సేవలు పొందుతున్నారు. ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. గడిచిన 24 గంటల్లో 50 మందికి టెస్టులు చేయగా పది మందికి కోవిడ్ ఉన్నట్లు నిర్ధారణైంది. వీరిలో తొమ్మిది మంది వారి వారి ఇళ్లలో వైద్యం పొందుతుండగా ఒకరు ఆసుపత్రిలో చేరారు.



కళారూపాలతో ఆలోచింపజేసిన విద్యార్థులు

సౌత్ జోన్ యూత్ ఫెస్టివల్ అదుర్స్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రతిభే కొలమానం.. అవధులు లేని ఉత్సాహం. ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా రెండు రోజులుగా జరుగుతున్న 37వ సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్ (యూనిఫెస్ట్) 2023-24 దీనికి వేదికయ్యింది. రెండో రోజైన శనివారం యువ భేరి కార్యక్రమంలో భాగంగా ఉదయం శాస్త్రీయ నృత్యాలు, స్పాట్ పెయింటింగ్, శాస్త్రీయ వాయిద్యం, క్విజ్, మిమిక్రీ పోటీలను నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి రూపకాలు, శాస్త్రీయ గాత్రం, స్పాట్ ఫోటోగ్రఫీ పోటీలను ఎయు కన్వెన్షన్ సెంటర్, సాగరిక ఆడిటోరియం, ఎయు స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ వేదికల్లో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతమైన పాండిచ్చేరి నుంచి 23 విశ్వవిద్యాలయాకు చెందిన 800 మంది విద్యార్థులు ఈ యూత్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. ఆరు విభాగాలలో 28 అంశాలలో పోటీలు జరుగుతున్నాయి. దేశం నలుమూలల నుంచి వచ్చిన నిపుణులైన 19 మంది న్యాయ నిర్ణేతలుగా ఉన్నారు. వారిని అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ ఎంపికచేసి విజేతలను నిర్ణయించే ప్రక్రియను అప్పగించింది. సాంస్కృతిక పోటీలను ఎఐయు అబ్జర్వర్ డాక్టర్ మనీష్ జంగ్ర పర్యవేక్షించారు. శనివారం జరిగిన పోటీలను కల్చరల్ కో-ఆర్డినేటర్ ఆచార్య ఎన్.విజయ్ మోహన్, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, పాలక మండలి సభ్యురాలు ఆచార్య పి.సునీత, ప్రిన్సిపాల్స్ ఆచార్య జి.శశిభూషణరావు, వై.రాజేంద్రప్రసాద్, డీన్‌లు ఆచార్య టి.షారోన్ రాజు, ఆచార్య ఎ.పల్లవి, ఆచార్య కె.బసవయ్య, ఆచార్య వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని వీక్షించారు.

దోచుకోవడానికే 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రాన్ని దోచుకోవడానికే జగన్ 'ఆడుదాం ఆంధ్ర' తీసుకువచ్చారని పశ్చిమ టిడిపి ఎమ్మెల్యే పి.గణబాబు ఆరోపించారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడుదాం ఆంధ్ర కార్యక్రమం కేవలం ప్రచార ఆర్భాటానికి మాత్రమే పనికొచ్చిందన్నారు. ఓటర్లను ఆకర్షించడానికి కేవలం ఐదు క్రీడలను ఆడుదాం ఆంధ్రలో పెట్టారని, నిబంధనలకు విరుద్ధంగా పోటీలను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అడుదాం ఆంధ్ర కార్యక్రమానికి రూ.100 కోట్లు కేటాయించి, నాసిరకం కిట్లను సరఫరా చేస్తూ డబ్బులు దోచుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో అనేక క్రీడా మైదానాలు అధ్వాన్న పరిస్థితుల్లో ఉన్నాయని, జిల్లాకు రూ.10 కోట్లు కేటాయించి క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తే బాగుండేదని అన్నారు. ఒలింపిక్స్‌లో ఉన్న క్రీడా అంశాలకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో ప్రాధాన్యత లేదన్నారు.

జెడ్‌పిలో పలువురికి ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జిల్లా పరిషత్‌లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు తొమ్మిది మంది ఉద్యోగోన్నతి పొందారు. వారికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర శనివారం శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ ఎం.పోలినాయుడు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు కృషి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్లాస్టిక్‌ను తగ్గించడం ప్రధాన లక్ష్యంగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఐటిసి ఫుడ్స్ వంద శాతం పేపర్ బ్యాగ్ ప్యాకేజింగ్‌లో, సన్‌ఫీస్ట్ ఫార్మ్‌లైట్ డైజెస్టివ్ బిస్కెట్ ఫ్యామిలీ ప్యాక్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి ఆలీ హరీష్ షేర్ నగరంలోని ప్రముఖ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ ప్యాకేజింగ్ విధానం పరిశ్రమలోనే మొదటి ఆవిష్కరణ అని, బిస్కెట్ విభాగంలో బ్రాండ్‌ను ట్రెండ్‌సెట్టర్‌గా నిలిచేలా ఉందని తెలిపారు.